# నమస్తే తెలంగాణ
## మహబూబాబాద్

5 | గురువారం 7 మార్చి 2024 | MAHABUBABAD





నర్సంపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## 'మావోయిస్టులారా.. ఊరు రమ్మంటోంది'




ప్రగళ్లపల్లి శివాలయం ప్రహరీకి అతికించిన పోస్టర్లు

### వాజేడు పోలీసుల వినూత్న ప్రచారం

వాజేడు, మార్చి 6 : మావోయిస్టులు జన జీవన స్రవంతిలోకి వచ్చేలా వాజేడు పోలీసులు వినూత్న ప్రచారం చేపట్టారు. మండలంలోని ప్రగళ్లపల్లి శివాలయం ప్రహరీకి బుధవారం వెంకటాపురం సీఐ బండారు కుమార్, వాజేడు ఎస్సై చావళ్ల వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో మావోయిస్టులకు పునరావాసం కల్పించడానికి సంబంధించిన పోస్టర్లను అతికించారు. అందులో 'మావోయిస్టులారా మీ కుటుంబం ఎదురుచూస్తోంది ! మీ ఊరు రమ్మంటోంది మీ స్వేచ్ఛకు, అభివృద్ధికి భరోసా తెలంగాణ ప్రభుత్వం, కాలం చెల్లిన సిద్ధాంతాలు వీడండి.. అమూల్యమైన జీవితాన్ని కాపాడుకోండి.. మా వద్దకు వచ్చిన వెంటనే మీ ఇంటికి వెళ్లొచ్చు.. మీ పునరావాసం తెలంగాణ ప్రభుత్వ హామీ..' అంటూ ప్రచారం చేశారు.

# ఎల్ఆర్ఎస్ ఫీజుపై బీఆర్ఎస్ కదం

### కాంగ్రెస్ సర్కారు తీరుపై నేతల గరంగరం




వరంగల్ చౌరస్తాలో నినదిస్తున్న కార్యకర్త




జనగామలో ప్లకార్డు చేతబూని నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్త

**ఫీజు వసూలు చేయకుండా ఉచితంగా చేయాలని డిమాండ్.. ప్రజలపై ఆర్థిక భారం మోపవద్దంటూ నినాదాలు**

**ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హోరెత్తిన ధర్నాలు.. పాల్గొన్న ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, దరఖాస్తుదారులు**

**జనగామలో ఎమ్మెల్యే పల్లా, తొర్రూరులో ఎర్రబెల్లి, హనుమకొండలో దాస్యం ఆధ్వర్యంలో నిరసనలు**

ఎల్ఆర్ఎస్(ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం) ఫీజు వసూలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై బీఆర్ఎస్ కదం తొక్కింది. ఈమేరకు ఫీజును రద్దు చేసి ఉచితంగా చేయాలనే డిమాండ్‌తో బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా ధర్నాలు నిర్వహించి కాంగ్రెస్ సర్కారును ఎండగట్టింది. ఆయా చోట్ల తలపెట్టిన నిరసన కార్యక్రమాల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులతో కలిసి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనగా ప్లకార్డుల ప్రదర్శనలు, నినాదాలతో మున్సిపల్ కేంద్రాలు హోరెత్తాయి. ఎన్నికలప్పుడు అనేక సభల్లో 'ఎల్ఆర్ఎస్ ఉచితం' అంటూ మోసపూరిత ప్రకటనలు చేసి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత మాటమార్చి ప్రజలను దగా చేస్తున్నదంటూ ధ్వజమెత్తారు. ప్రజలపై ఆర్థిక భారం మోపకుండా ఫీజును రద్దు చేయాలంటూ ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

– నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మార్చి 6



హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నాయి. అమలు సాధ్యంకాని, 'ఉచిత' హామీలతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని దాస్యం ధ్వజమెత్తారు. ఎల్ఆర్ఎస్ విషయంలో నేడు కలెక్టర్లకు, మున్సిపల్ కమిషనర్లకు వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాల్సిందేనని.. లేకపోతే పోరాటం ఉధృతం చేస్తామని సారయ్య హెచ్చరించారు. ఎల్ఆర్ఎస్ విషయంలో కాంగ్రెస్ తీరు మారాల్సిందేనన్నారు.



వరంగల్ చౌరస్తాలో మహాధర్నాలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, నాయకులు

వరంగల్ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు ప్లకార్డులు చేతబూని నిరసనలతో హోరెత్తించారు. నర్సంపేటలో మున్సిపల్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. గతంలో అదే విధానాన్ని రద్దు చేయాలని గొంతు చించుకున్న కాంగ్రెస్ నాయకులు నేడు అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రజల సొమ్మును దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నదని ధ్వజమెత్తారు.

జనగామ ఆర్టీసీ చౌరస్తాలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు గంటల పాటు ధర్నా నిర్వహించారు. మార్చి 31 వరకు ఎల్ఆర్ఎస్ కట్టి తీరాలని ప్రజల మెడమీద కత్తి పెట్టారని, ఎల్ఆర్ఎస్ ప్రభుత్వ ఖజానా నింపడానికే అన్నట్లుగా ఉందని పల్లా ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన మాట ప్రకారం 25 లక్షల 44 వేల మంది దరఖాస్తుదారులకు ఉచితంగా ఎల్ఆర్ఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



జనగామ: ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు



తొర్రూరులోని వరంగల్-ఖమ్మం ప్రధాన రహదారిపై ధర్నాలో పాల్గొన్న మాజీ మంత్రి దయాకర్‌రావు, బీఆర్ఎస్ శ్రేణులు

మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పార్టీ శ్రేణులతో కలిసి బైఠాయించి నిరసన తెలిపారు. ఎల్ఆర్ఎస్ ఫీజు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికలప్పుడు ఉచితం అని ఇప్పుడేమో ప్రజల నుంచి రూ.20వేల కోట్లు వసూలు చేసేందుకు సిద్ధపడిందని, దీని వల్ల 25లక్షల పైచిలుకు కుటుంబాలపై భారం పడుతుందన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే విరమించుకొని ఉచితంగా చేయాలన్నారు.



వర్ధన్నపేటలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్, కార్యకర్తలు

వర్ధన్నపేటలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నా, రాస్తారోకో చేసి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఎలాంటి రుసుము లేకుండా ఎల్ఆర్ఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## వైభవం.. శివపార్వతుల కల్యాణం



కల్యాణ వేడుకకు హాజరైన భక్తులు

కాశీబుగ్గ, మార్చి 6: కాశీబుగ్గలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా తమిళనాడులోని కుంభకోణంలో తయారు చేసిన శివపార్వతుల విగ్రహాలకు కల్యాణ తంతు గావించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బయ్యాస్వామి, డాక్టర్ గోనె జగదీశ్వర్, మండల శ్రీరాములు, మామిడి ఈశ్వరయ్య, ముచ్చర్ల ప్రభాకర్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ దీపాల వెలుగుల్లో కాళేశ్వరం ఆలయం

## మహా శివరాత్రికి వేళాయె..

**కాళేశ్వరంలో నేటి నుంచి 9 వరకు శివరాత్రి ఉత్సవాలు**

**8న స్వామి వారి కల్యాణం**

కాళేశ్వరం, మార్చి 6 : కాళేశ్వర-ముక్తీశ్వర స్వామి దేవస్థానం మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. తెలంగాణ సహా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి సుమారు 3.50 లక్షల మంది భక్తులు దర్శనానికి రానున్న నేపథ్యంలో ఆలయ అధికార గణం ఏర్పాట్లు చేస్తోంది. నేటి నుంచి 9వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనుండగా ఇప్పటికే రంగురంగుల విద్యుద్దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. జాగారం ఉండే భక్తులకు కాలక్షేపం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం హనుమాన్ గుడి సమీపంలోని ఖాళీ స్థలాన్ని పార్కింగ్ కోసం కేటాయించారు. అలాగే వీఐపీలకు దేవస్థానం పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని పార్కింగ్ కోసం కేటాయించారు. దివ్యాంగుల కోసం నేరుగా గోదావరి నది వద్దే వాహన పార్కింగ్‌కు అవకాశం కల్పించారు.



చెత్తాచెదారంతో అధ్వానంగా పుష్కరఘాట్

## శివ శివా..!

**పుష్కరఘాట్ వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం**

కాళేశ్వరం, మార్చి 6 : మహా శివరాత్రికి కాళేశ్వరం వచ్చే భక్తులకు తిప్పలు తప్పేలా లేవు. రేపు ఉత్సవాలు మొదలవనుండగా అధికారులు గానీ, ఇటు దేవస్థానం సిబ్బంది గానీ ఎక్కడా కనిపించడం లేదు. జాగరణ కోసం తెలంగాణ, మహారాష్ట్ర నుంచి లక్షలాది మంది భక్తులు కాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకుంటారు. ప్రతి సారి శివరాత్రికి నెల రోజుల ముందు నుంచే ఏర్పాట్లు ఘనంగా చేపట్టేది. కానీ, ఈసారి ఏర్పాట్లు చేయాలనే ధ్యాస ఎవరిలోనూ కనిపించడం లేదు. కాళేశ్వర, ముక్తీశ్వర స్వామి దేవస్థానం నుంచి మొదలు త్రివేణి సంగమం వరకు పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. గోదావరి పుష్కర ఘాట్, నది వద్ద ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయి ఉంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా లేకపోవడంతో స్థానిక అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్వయంగా రాష్ట్ర మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఇలాంటి పరిస్థితి ఏంటని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రామప్పకు శివరాత్రి స్పెషల్ బస్సులు

హనుమకొండ చౌరస్తా, మార్చి 6 : శివరాత్రి పండుగను పురస్కరించుకుని హనుమకొండ నుంచి రామప్పకు ప్రత్యేక బస్సులు ప్రతి అరగంటకు నడుపుతున్నట్లు వరంగల్-2 డిపో మేనేజర్ తెలిపారు. హనుమకొండ నుంచి రామప్పకు ఎక్స్‌ప్రెస్(పెద్దలకు రూ.100, పిల్లలకు రూ.60) పల్లెవెలుగు(రూ.80, రూ.40) ములుగు నుంచి రామప్పకు ఎక్స్‌ప్రెస్(రూ.40, రూ.30) పల్లెవెలుగు(రూ.30, రూ.20) ఉంటుందని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



వేయిస్తంభాల దేవాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన క్యూలైన్లు

## వేయిస్తంభాల ఆలయంలో నేటి నుంచి ఉత్సవాలు

**8న కల్యాణ మండపాన్ని పునః ప్రారంభించనున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు**

హనుమకొండ చౌరస్తా, మార్చి 6 : వేయిస్తంభాల దేవాలయంలో మహాశివరాత్రి మహోత్సవాలను గురువారం నుంచి నిర్వహించనున్నట్లు ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు చేసి, ఐదురోజుల బ్రహ్మోత్సవాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా రుద్రేశ్వరస్వామికి రుద్రాభిషేకాలు, సాయంత్రం కల్యాణోత్సవం ఉంటుందని, రాత్రి 12 గంటలకు లింగోద్భవకాల సమయంలో 112 రుద్రాలతో లింగోద్భవకాలపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. శివరాత్రి రోజు కల్యాణమండపాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొని పునఃప్రారంభించనున్నట్లు వివరించారు. మహాశివరాత్రి ఉత్సవాల కోసం అన్ని శాఖల అధికారులు విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. క్యూలైన్స్, చలువ పందిళ్లు, మంచినీటి సౌకర్యం, వలంటీర్ల సేవలు, విద్యుత్ అలంకరణ చేపట్టినట్లు ఈవో వెంకటయ్య వివరించారు.

## మేడారం ఆదాయం రూ.13.25 కోట్లు

**ముగిసిన హుండీల లెక్కింపు**

**బస్తాల్లో నాణేల తరలింపు**



మేడారం హుండీల ద్వారా వచ్చిన నాణేల బస్తాలు

వరంగల్, మార్చి 6 : మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర హుండీల లెక్కింపు ముగిసింది. ఏడు రోజుల పాటు హుండీల లెక్కింపు ప్రక్రియ దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో కొనసాగింది. హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏడు రోజుల్లో 540 హుండీల ద్వారా రూ.13,25, 22,511 ఆదాయం వచ్చింది. నోట్లు, చిల్లర నాణేలతో పాటు భక్తులు బంగారం, వెండి వస్తువులను అమ్మవార్లకు కానుకలుగా సమర్పించారు. 779.800 గ్రాముల బంగారం, 55 కిలోల 150 గ్రాముల వెండి వస్తువులు కానుకలుగా వచ్చాయి. హుండీల ద్వారా వచ్చిన నాణేలను లెక్కించిన అధికారులు వాటిని క్లాత్ సంచుల్లో మూటలు కట్టి బ్యాంకులకు తరలించారు. హుండీల ఆదాయాన్ని దేవాదాయ శాఖ అధికారులు హెచ్‌డీఎఫ్‌సీ, యూనియన్, కెనరా బ్యాంకుల్లో జమ చేశారు. వారం రోజుల పాటు సాగిన మేడారం హుండీల లెక్కింపు ప్రక్రియను దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, మేడారం జాతర ఈవో రాజేంద్రం పర్యవేక్షించారు. దేవాదాయ శాఖ సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థలకు చెందిన సుమారు 350 మంది హుండీల లెక్కింపులో పాల్గొన్నారు.